# ప్రజల తత్వశాస్త్రం

*మార్క్సిజం–తత్వశాస్త్రం అన్న టి.రవిచంద్‌గారి పుస్తకానికి **1983** సం॥లో కామ్రేడ్ త్రిపురనేని మధుసూదనరావుగారు రాసిన పీఠికను యధాతథంగా ముద్రిస్తున్నాం. – సంపాదకుడు*

**తత్వశాస్త్రం** అనగానే బెదిరిపోయేవాళ్ళూ, అది మనకి సంబంధించిన వ్యవహారం కాదు అనుకునేవాళ్ళూ చాలామంది వున్నారు. తత్వశాస్త్రానికి నిత్యజీవిత సమస్యలకీ ఎలాంటి సంబంధంలేదని అనుకునేవాళ్ళూ వున్నారు. కానీ ఇలా అనుకునేవాళ్ళు కూడా ఏదో ఒక తాత్విక దృక్పథం లేకుండా బతకడంలేదు. తెలిసినా, తెలియకపోయినా సమాజంలో జీవించవలసిన ప్రతివ్యక్తికీ ప్రకృతిపట్లా, సమాజంపట్లా తాత్విక భావాలు వుంటాయి. తత్వశాస్త్ర గ్రంథాలు జటిలంగా వుండడంవల్లా, తత్త్వవేత్తలు మహా మేధావులనే (భమలు ప్రచారంలో వుండడం వల్లా సామాన్య ప్రజానీకం, విద్యావంతులూ కూడా తత్వశాస్త్రం అంటే అత్యద్భుత మేధో వ్యవహారమని భావించడం జరుగుతోంది. సామాజిక జీవితంలోని భావాలనే తత్వశాస్త్రం రాసేవాళ్ళు సిద్ధాంతీకరిస్తారు. తత్వశాస్త్రం సమాజంలో జరిగే వర్గపోరాటం నుంచి పుడుతుంది. ప్రపంచంలోని వివిధ సమాజాల చరిత్రలు ఒకే విధమైన వస్తుగత సూత్రాలతో పురోగమిస్తాయి. ఈ కారణాలవల్లనే ప్రపంచం లోని తత్వశాస్త్రాల చరిత్రల్లో పోలికలు స్పష్టంగా కనిపిస్తాయి. రూపంలో ఆకారంలో భేదమే కానీ సారాంశంలో అన్నిదేశాల తత్వశాస్త్రాలకీ మధ్య తేడాలకంటే పోలికలే ఎక్కువ. ప్రపంచ తత్వశాస్త్ర సిద్ధాంతాల్లోని జాతీయ రూపాల్ని తొలగించి చూస్తే కొంత గందరగోళం తగ్గుతుంది. పైకి కనిపించినట్టు ప్రపంచంలో తాత్విక సిద్ధాంతాలు అసంఖ్యాకంగా లేవు. అన్ని సిద్ధాంతాల్నీ క్రోడీకరించి పరిశీలిస్తే వాటిని రెండురకాలుగా సులభంగానే విభజించవచ్చును. ఆత్మ, దేవుడు, అతీతశక్తి, భావం ఒకటి వుంది, దాన్నించే ఈ ప్రకృతీ, ఈ సమాజం సృష్టించబడ్డాయి అనే తాత్విక సిద్ధాంతం ఒకటి. దీన్నే భావవాదమనీ, ఆధ్యాత్మిక వాదమనీ అంటున్నాం. నిరంతర చలనంలో వుండే పదార్థంనుంచీ ప్రకృతి రూపాలూ, సమాజ వ్యవస్థలూ, భావాలూ ఏర్పడతాయి అనేది మరొక సిద్ధాంతం. దీన్నే పదార్థవాదం, భౌతికవాదం అంటున్నాం. ఎన్ని యుక్తుల్ని ప్రయోగించి తప్పించుకోవాలని చూసినా ప్రతిసిద్ధాంతం ఈ రెండు శిబిరాల్లో ఏదో ఒక శిబిరంలో చేరవలసిందే. ప్రపంచ తత్వశాస్త్ర చరిత్ర అంతటా ఈ రెండు వాదాలూ ఆదినుంచీ కొనసాగుతూనే వున్నాయి. దీన్నిబట్టే తత్వశాస్త్రం వర్గపోరాటంనుంచీ ఏర్పడింది అని ఖండితంగానే చెప్పవచ్చును.

వర్గసమాజంతోబాటే తత్వశాస్త్రం కూడా పుట్టింది. శ్రమవిభజన జరిగిన క్రమంలో చైతన్యం తనకు మూలమైన వాస్తవం నుంచి విడివడిపోయి స్వతంత్ర ప్రతిపత్తిగల రంగంగా భ్రమ కలిగించింది. శ్రమ ఫలితాన్ని శ్రమశక్తి నుంచి విడదీయడంవల్ల శ్రమశక్తి నుంచీ ఉత్పన్నమైన వస్తుజాలంమీద శ్రామికులకు ఎలాంటి అధికారమూ వుండదు. ఏ వస్తువుల్ని ఎందుకు, ఎలా ఉత్పత్తి చెయ్యాలో ఆ పథకమూ శ్రామికులనుంచీ దూరం చెయ్య బడుతుంది. ఉత్పత్తిమీద మారకంమీదా అధికారం శ్రామికేతరుల చేతుల్లోకి వెళ్ళి పోతాయి. దీన్తో ఉత్పత్తి చేసేది పథకాలు వేసేవాళ్ళూ, అధికారం చేపట్టినవాళ్ళు అనే తలకిందు అభిప్రాయం జనం మనస్సులో పాదుకొనిపోతుంది. అంటే భావమే, చైతన్యమే భౌతిక వస్తువుల్ని ఉత్పత్తిచేస్తుంది అనే భావగందరగోళం వ్యాపిస్తుంది. ఇది వర్గ సమాజంతో పాటు వచ్చేది. దోపిడీవర్గాల భావ జాలంగా వచ్చేది. భావవాదం తత్వశాస్త్రంలోకి ఇలా అడుగు పెడుతుంది. అధికారవర్గమే విశ్రాంతికర వర్గం కాబట్టి మొదట భావవాదానికే సిద్ధాంతస్థాయి వస్తుంది. భౌతిక వాదానికి సిద్ధాంత స్థాయి రావడానికి చాలాకాలం పట్ట వచ్చును. శ్రామికులకు శ్రమఫలితం, శ్రమ క్రమంమీద పథకం తమ చేతుల్లో నుంచీ పోయింది అనే స్పృహ ఏ మేరకి పెరుగుతుందో, ఆ మేరకే భౌతికవాదం సిద్ధాంత రూపాన్ని పొందుతుంది. శ్రామికుల తత్వశాస్త్రమైన భౌతికవాదానికి శ్రామికులే సిద్ధాంతరూపాన్ని కల్పింపలేకపోవచ్చును. వాళ్ళకి ఈ విశ్రాంతీ, అవకాశమూ లేకపోవచ్చును. పాలకవర్గాల మేధావులనుంచీ ఒక ప్రగతిశీల భాగం శ్రామికుల పక్షానికి వచ్చి భౌతికవాదానికి సిద్ధాంతస్థాయి కల్పించవచ్చును. దీనికే ఎక్కువ అవకాశం వుంది కూడా. ఆదిమసమాజంలో తత్వశాస్త్రం లేదు. వుండే అవకాశం లేదు. మనిషి వ్యక్తిగా మారి తనని తాను పక్కనుంచీ పరిశీలించుకునే స్థితి గణసమాజ సమిష్టిలో లేదు. అది వర్గ సమాజంలోనే సాధ్యం. భౌతికత ముందే వున్నప్పటికీ సిద్ధాంత భౌతికవాదం కంటే ముందే భావవాదం వుంటుంది. వీటినిబట్టి తత్వశాస్త్రం వర్గసమాజంతోబాటే పుడుతుందనీ, తత్వశాస్త్రంలో రాష్ట్రస్థాయి ముందు భావవాదానికే వస్తుందనీ, ఆదిమ భౌతికవాదం శ్రామికశాస్త్రం అయినప్పటికీ దానికి శాస్త్ర రూపాన్ని భావవాదం నుంచీ విడివడివచ్చిన తాత్వికులే చేసి వుంటారనీ సాపేక్షంగా నిర్ధారణ చేయవచ్చును.

భావవాదం, భౌతికవాదం అని తత్వ శాస్త్రాన్ని విభజించడం కూడా సౌలభ్యం కోసమే కానీ భౌతిక పునాదిలేని భావవాదం వుండదు. దేవుడు, ఆత్మ, పునర్జన్మ, మాయ, శూన్యం బ్రహ్మంవంటి భావవాద భావనలకి చారిత్రక, సామాజిక, ప్రాకృతిక మూలాల్ని సహేతుకంగా ప్రదర్శించవచ్చును. సామాజిక, ప్రాకృతిక ఆవరణని అధిగమించిన భావన ఒక్కటి కూడా భావవాదంలో వుండదు. కాబట్టి వర్గపోరాటంతో దాని మరొక రూపమైన ఉత్పత్తికోసం పోరాటంతో భావవాద భౌతిక పునాదిని బహిర్గతం చేస్తూ పోతే కాలగమనంలో భావవాదం కరిగిపోయి ఎండిపోతుంది. తత్వశాస్త్రం తనకి సహజమైన భౌతిక పునాదిమీద నిలిచి ప్రజల తత్వశాస్త్ర రూపాన్ని పొందుతుంది. వర్గ సమాజంలో వర్గ తత్వశాస్త్రం వుంటుంది. శ్రామికవర్గ తత్వశాస్త్రం ఏ దశలో అయినా

భౌతికవాద రూపంలోనే వుంటుంది. దోపిడీ వర్గాల తత్వశాస్త్రం భావవాదరూపంలోనే వుంటుంది. అయితే ఈ వర్గాలకి వుండే ఐక్యత, ఘర్షణ సంబంధాలవల్ల భౌతికవాదం మీద భావవాద ప్రభావం, భావ వాదం మీద భౌతికవాద ప్రభావం వుంటాయి. భావవాదం తత్వశాస్త్ర అభివృద్ధికి దోహదం చేసింది. అస్తిత్వాన్ని వదిలిపెట్టి ఏకముఖంగా చైతన్యాన్ని మాత్రమే అభివృద్ధిచేసినప్పటికీ తాత్విక చింతనకీ, తార్కిక ప్రతిపాదనా పద్ధతికీ భావవాదం దోహదం చేసింది. ఎన్ని రూపాల్ని పొందినప్పటికి వర్గసమాజ చరిత్ర అంతటా భావవాద తత్వశాస్త్రం పాలకవర్గాల, శ్రేణుల తత్వశాస్త్రమే. అయితే భాష, మెదడు, సమాజం నుంచీ రూపొందే వ్యక్తిత్వం, పీడిత వర్గాల్తో నిరంతరం సంబంధం భావవాదంలో భౌతిక వాద ఛాయల్ని ప్రవేశపెడతాయి. భౌతికవాదం భావవాద చట్రంనుంచీ బయటపడడం ఇంకా క్లిష్టమైన విషయం. వర్గ అంధత్వంవల్ల భావ, భౌతికవాదాలు కొన్ని సిద్ధాంతాల్లో కలసిపోవడం జరుగుతుంది.

విజ్ఞానశాస్త్రాలు అభివృద్ధిపొంది ఉత్పత్తి శక్తులమీదా, ఉత్పత్తిశక్తుల్లో ప్రధానమైన శ్రామిక వర్గం మీదా తీవ్రమైన ప్రభావం చూపేవరకు భావవాద కుంభస్థలం మీద పెద్ద దెబ్బపడదు. విజ్ఞాన శాస్త్రాలు కూడా వర్గపోరాటంనుంచే అభివృద్ధి పొందుతాయి. అయితే అది ఉత్పత్తి కోసం పోరాటరూపంలో వుంటుంది. ప్రపంచ తత్వశాస్త్రం అంతటా గతితర్కం, భౌతికవాదం ఏదో ఒక స్థాయిలో ఎప్పటినుంచో వున్నాయి. ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలోనే కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథంగా అంటే ప్రజల తత్వ శాస్త్రంగా గతితార్కిక భౌతికవాదం అభివృద్ధి పొందింది. మార్క్స్, ఎంగెల్స్‌లు దీనికి ఆచరణాత్మక సిద్ధాంత రూపాన్ని ఇచ్చారు. దీన్నే మార్క్సిస్టు తత్వశాస్త్రం అని పిలుస్తున్నాం. కార్మికవర్గం, విజ్ఞానశాస్త్రాల అభివృద్ధీ గతితార్కిక భౌతిక వాదానికి మూలాధారాలు. ప్రపంచ తత్వశాస్త్రం గమ్యం గతితార్కిక భౌతికవాదం. వర్గరహిత సమాజం ఏర్పడేటంత వరకూ గతితార్కిక భౌతికవాదం, కార్మికవర్గ తత్వశాస్త్రం గానే వుంటుంది. కార్మికవర్గ పార్టీ తత్వశాస్త్రం గానే వుంటుంది. కార్మికవర్గ తత్వశాస్త్రం అనగానే, కార్మికవర్గ పార్టీ తత్వశాస్త్రం అనగానే చాలామంది ఇదేమిటి? తత్వశాస్త్రం వంటి మహోన్నత విషయాన్ని వర్గస్థాయికి దించుతారా? అని నొసలు చిట్లించవచ్చును. కానీ ఆదినుంచీ తత్వశాస్త్రం వర్గతత్వ శాస్త్రంగానే వుంది. వర్గాలకి ప్రాతినిధ్యం వహించే పార్టీలకి ఆ వర్గాల తత్వశాస్త్రం వుంటుంది. అంతిమంగా కార్మిక వర్గం వర్గాల్ని రద్దుచేసి, తానూ ఒక వర్గంగా రద్దు అయిపోయి వర్గరహిత సమాజాన్ని స్థాపించినట్టే, వర్గతత్వశాస్త్రాన్ని రద్దుచేసి గతితార్కిక భౌతికవాదాన్ని మొత్తం సమాజ తత్వశాస్త్రంగా ఆచరణీకరిస్తుంది.

తత్వశాస్త్రం విషయంలో మనం అనిర్దిష్ట, అభావవైఖరిని తీసుకోకూడదు. మార్క్సిస్టు తత్వ శాస్త్రాన్ని మన భారతదేశ వాస్తవికతతో అన్వయించాలి. అలా అన్వయించడానికి కృషి చాల చెయ్యాలి. కానీ అన్వయించడం సాధ్యమే. విజ్ఞానశాస్త్ర సిద్ధాంతాన్ని ముఖ్యంగా ప్రకృతికి సంబంధించిన సిద్ధాంతాన్ని ఏ దేశంలో అయినా అన్వయించుకోవడం, ఫలితాన్ని సాధించడం సులభం. సమాజానికి సంబంధించిన సామాజిక శాస్త్ర సిద్ధాంతాన్ని అన్వయించడానికి పోరాటం, అధ్యయనం, సమిష్టి కృషి అవసరం అవుతాయి. అలాగే విజ్ఞానశాస్త్ర పరిశోధనా ఫలితాన్ని వున్న వాటిని వున్నట్టుగా స్వీకరించి అన్వయించు కోవచ్చును. కానీ తాత్విక సిద్ధాంతాల్ని అంత సులభంగా అన్వయించలేం. ఎన్నో ప్రయోగాలూ వైఫల్యాలూ అవసరం కావచ్చు. గతితార్కిక భౌతికవాదం కేవలం పాశ్చాత్య తత్వశాస్త్రం కాదు. అది ప్రపంచతత్వశాస్త్ర ఫలితం. ప్రపంచ చరిత్ర గమన సూత్రాల సర్వాంగవాదం. దీన్నే భారతదేశ వాస్తవికతకి అన్వయించాలంటే భారతీయ తత్వశాస్త్రాన్నీ, దాని చరిత్రనీ అధ్యయనం చేసి అన్వయించాలి. భారతీయ తత్వశాస్త్రంలో భావవాద, భౌతికవాద, గతి తర్కాల చరిత్ర ఫలితంగా, కొనసాగింపుగా గతితార్కిక భౌతికవాదాన్ని సైద్ధాంతికంగా వర్గ దృష్టితోనూ, ఆచరణాత్మకంగా కార్మిక, రైతాంగ పోరాటాల దృష్టితోనూ అన్వయించుకోవాలి. అలా అన్వయించినప్పుడు మాత్రమే భారతదేశ వాస్తవికతా, గతితార్కిక భౌతికవాదం రెండూ సుసంపన్నమవుతాయి. ఇలా నిర్దిష్టంగా అన్వయించబడిన మార్క్సిజాన్నే మార్క్సిజం అంటారు. ఇలాంటి నిర్దిష్ట మార్క్సిజాన్ని సాధించగలిగినప్పుడే విప్లవ పోరాటాలు వేగవంతం అవుతాయి. ఈ ప్రయత్నం అన్ని రంగాల్లోనూ జరగవల్సిందే. ఎంతో కొంత జరుగుతూనే వుంది. ఈ ప్రయత్నంలో తత్వశాస్త్రంలో జరుగుతున్న కృషిని స్థూలంగా పరిచయం చెయ్యడమే రవిచంద్ ఈ వ్యాసాల్లో సాధించదలచుకున్న లక్ష్యం.

ప్రాచీన భారతీయ భౌతికవాదంపై మార్క్సిస్టు పరిశోధనలు అనే వ్యాసం నుంచీ అన్ని వ్యాసాల్లోనూ మార్క్సిజాన్ని భారతీయ తత్వశాస్త్రానికి అన్వయించడానికి ఎవరు ప్రయత్నం చేశారు? అనే విషయాన్ని వివరించాడు. దేవీప్రసాద్ చటోపాధ్యాయ, రూబెన్‌ల కృషిని ప్రత్యేకంగా రవిచంద్ ప్రశంసించాడు. అయితే వీళ్ళ కృషి ఫలితాలమీద తన సొంత అభిప్రాయాల్ని చెప్పడానికి అంతగా ప్రయత్నం చేయలేదు. వాళ్ళు అభినందించదగిన కృషిచేసిన మాట నిజమే. కానీ అది ఇంకా ఎకడమిక్ స్థాయిలోనే వుంది. ప్రజపోరాట రాజకీయాల్లోకి రాలేదు. అసలు ఈ పండితులు రాజకీయ దృక్పథం నుంచీ కృషిచేసింది తక్కువ. అదీ వీళ్ళల్లో ప్రధానమైన లోపం. దేవీప్రసాద్ చటోపాధ్యాయ కేవలం సిద్ధాంతవాది. ప్రజా పోరాటాల మీద ఆ పోరాటాలకి నాయకత్వం వహిస్తున్న విప్లవ పార్టీలమీద ఆయన ప్రభావం ఏమీలేదు. నక్సల్‌బరీ రాజకీయ పోరాట పంథా ప్రవేశపెట్టిన రాజకీయాల మీద దేవీప్రసాద్ ప్రభావం వేయలేదు. ప్రభావితుడు కాలేదు. "భారతీయ తత్వశాస్త్రంలో ఏది జీవించి వుంది, ఏది చచ్చిపోయింది" అనే గ్రంథంలో ఒకటి జీవించి వుంది అని చెప్పడానికి, ఒకటి మృతప్రాయమై పోయింది అని చెప్పడానికి దేవీప్రసాద్ అనుసరించిన పద్ధతి ఏమిటి? వాస్తవంగా భారత పీడిత ప్రజానీకంలో ఏ భారతీయ తాత్విక ధోరణులు జీవించి వున్నాయి, ఏ తాత్విక ధోరణి వాళ్ళమాటల్లో కాకుండా వాళ్ళ పోరాట ఆచరణలో ప్రేరణ కల్పిస్తూ జీవించి వున్నాయి? ఏవి వాళ్ళని పాలకవర్గాలకి విధేయం చేస్తున్నాయి, అనేది కాదు దేవీప్రసాద్ చేసింది. భారతీయ తత్వ శాస్త్రంలో ఏది భౌతికవాదం? ఏది ఆధ్యాత్మిక వాదం? అనే అంశమే ప్రధానంగా చర్చించాడు. మార్క్సిస్టు-లెనినిస్టు, మావో ఆలోచనా విధాన పద్ధతి ఇది కాదు. భారతీయ తత్వశాస్త్రంలోని భౌతికవాద ధోరణుల్ని, గతితర్కాన్నీ ఆధారంగా చేసుకొని విప్లవ పోరాటాలకి అన్వయించి గతితార్కిక

భౌతికవాదానికి జాతీయ రూపం ఇవ్వడంలో దేవీప్రసాద్ ఒక్కడుగు ముందుకు వేశాడా? లేదు. అందుకనే రవిచంద్ ఇంకా విమర్శనాత్మకంగా లోతుగా దేవీప్రసాద్ గ్రంథాల్ని అధ్యయనం చెయ్యాలి.

ఈ వ్యాసాల్లో కనపడే ప్రధానమైన రెండో అంశం చార్వాక భౌతికవాదం. దీనిమీద దేవీ ప్రసాద్ విస్తృతమైన సమాచారాన్ని అందించాడు. రవిచంద్ కానీ ఇతర మార్క్సిస్టులు కానీ చార్వాకాన్ని అధ్యయనం చెయ్యడం, ప్రచారం చెయ్యడం పూర్తిగా సమంజసమే. కానీ ఇవ్వాళ చార్వాకులకు వారసులు మార్క్సిస్టులు కానీ నాస్తికవాదులు కారు. రవిచంద్ చార్వాకులకీ ఈనాటి నాస్తికులకీ బంధుత్వాన్ని కలుపుతున్నట్లు కనిపిస్తోంది. చార్వాకుల కాలాన్ని నిర్ణయించడం సాధ్యంకాదు కానీ చార్వాకుల పేరుతో పూర్వ గ్రంథాల్లో చెప్పబడిన భావాలు అన్నీ ఒకే విధంగా లేవు. ప్రాచీన తత్వశాస్త్రంలోని భౌతికవాదం అంతా ప్రగతిశీలమైందని (ఆనాటికయినా) చెప్పటానికి వీలులేదు. “వాటిని (వేదాల్ని) బ్రాహ్మణ పురోహితులు తమ స్వార్థప్రయోజనం కోసం పవిత్ర గ్రంథాలుగా ప్రచారం చేస్తున్నా యన్నారు” ఇలా చార్వాకులు అన్నమాట నిజమే కానీ ఇది మధ్యతరగతి పండితుల ఆగ్రహ ప్రదర్శనమే, నిరసనమే తప్ప భౌతికవాద దృక్పథం నుంచి చూడటంకాదు గదా? బ్రాహ్మణులూ పురోహితులూ ఆనాటి పాలక వర్గాల భాష్యకారులు సమర్థకులు. పోరాట బాణం ప్రయోగించవలసింది పాలకవర్గాల మీద. ఈనాటి నాస్తికుల్లో కూడా ఈ జాడ్యం వదలలేదు. ఎంతసేపూ బ్రాహ్మణుల్నీ, పురోహితుల్నీ, బాబాల్నీ, అమ్మల్నీ తిట్టడమే కానీ వీళ్ళంతా పాలకవర్గాల పుట్టలోని విషసర్పాలని చెప్పాల్సినపనిలేదా? “నాస్తికోద్యమం ఒక భావ విప్లవం” “వర్గ దృక్పథానికి అతీతంగా పని చెయ్యదు”. విప్లవ భావాలు విప్లవపోరాటాల నుంచీ పుడతాయి. నాస్తికోద్యమం ఏ వర్గ దృక్పథంగా వుందో విశ్లేషించవలసిన బాధ్యత రవిచంద్ మీద వుంది. దాన్ని నిర్వహించలేదు. భౌతికవాదులు కాని నాస్తికులూ, మార్క్సిజాన్ని కాక రివిజనిజాన్ని ఆమోదించే నాస్తికులూ, మార్క్సిజాన్ని ఆమోదించే నాస్తికులూ వున్నారు. అందరినీ ఒకేగాటకట్టి సమర్థించడం, ఖండించడం తప్పు. బౌద్ధమతం కూడా ఇలాంటిదే. అనేక పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలు బౌద్ధమతం పేరుతో అనేక దేశాల్లో ప్రచారంలో వున్నాయి. వీటిని విభజించి ఆయా సిద్ధాంతాల్ని వాటి పేరుతో పిలవడానికి ఇంకా ఎన్ని శతాబ్దాలు కావాలి? నాస్తికతని పాలక వర్గాలు సమర్థించే అవకాశం ఉన్నదంటే తప్పు ఏముంది? నాస్తిక సర్వోదయవాదులూ ఆస్తిక సర్వోదయవాదులూ లేరా? నాస్తిక అస్తిత్వ వాదులూ, ఆస్తిక అస్తికత్వవాదులూ లేరా? ఉదార బూర్జువావర్గం నాస్తికవాదాన్ని సమర్థించడం లేదా? రంగనాయకమ్మ “నాస్తికత్వం ఒక పరిశీలన” శీర్షికను పట్టుకొని రవిచంద్ చేసిన విమర్శ ఏమాత్రం సమంజసం కాదు. గోరా నాస్తికత్వం మీదనే రాయదలచుకున్నట్లు సందర్భంతోసహా ఆమె ఆ పుస్తకం ముందుమాటలో చెప్పారు. ఆమె రాయ దలచుకోని విషయాల్ని ఆమెకు తెలియని విషయాలుగా చిత్రించడం అర్థరహితం. చార్వాకుల గురించి రవిచంద్‌కి తెలిసిన విషయాలు రంగనాయకమ్మకి తెలియవు అనుకోవడం అమాయకత్వం.

“తప్పనిసరిగ ఆర్థిక పోరాటాల్లో భాగంగానే భావపోరాటం జరగాలి” ఆర్థిక పోరాటాల్లో కాదు రాజకీయ పోరాటాల్లో అని వుండాలి. కార్మికులు, రైతాంగం వేతనాలకోసం సమ్మె చేస్తుంటే అక్కడికి పోయి నాస్తికతని ప్రచారం చెయ్యవలసిన అవసరంలేదు. భావపోరాటానికి కూడా ఎత్తుగడలు వుండాలి. సందర్భ శుద్ధిలేకపోతే దుష్ఫలితాలు వస్తాయి. “బానిస వ్యవస్థలో భాగమే వర్ణవ్యవస్థ” వర్ణవ్యవస్థ ఫ్యూడల్ వ్యవస్థలో భాగం. వర్ణవ్యవస్థ కొందర్ని బానిసలుగా వ్యవస్థీకరించింది. “మానవుని మేధస్సు సంకల్పం సమాజంలో మానవుని ప్రవర్తనను నిర్ణయిస్తాయే కానీ అతని పశువాంఛలు నిర్ణయించవు” ఫ్రాయిడ్‌మీద విమర్శ బాగానే వుంది కానీ మనిషిలో ఏవి పశువాంఛలు? ఆకలి తీర్చుకోవడం, సెక్స్ సంబంధాలు వంటివేనా? ఇలా రవిచంద్ అనవచ్చా? మనిషిలో ఏ వాంఛలూ పశువాంఛలు కావు. అన్ని వాంఛల చుట్టూ సామాజికత, మానవత పేరుకొని వుంటాయి. జాతిగా మానవుల మనుగడకే మూలకారణంగా వుండే సెక్స్‌ని పశువాంఛ అనడం సాధారణమైన పొరపాటు కాదు. మానవజాతి లేకుండా భౌతికావసరాల ఉత్పత్తి ఎలా చేస్తాం? ఇంతకీ పశువులమీద మాత్రం కోపం ఎందుకు? పశువుల్ని కించపరచవలసిన అవసరం ఏముంది? ఫ్రాయిడ్‌ని ఖండించడం కోసం రవిచంద్ ఒక కాలు గోతిలో వేస్తున్నాడు. ఇలాంటి తప్పుల్ని రాసిన దాన్ని ఒకటి రెండుసార్లు విమర్శనాత్మకంగా చూసుకుంటే పరిహరించు కోవచ్చును.

భగవద్గీత మీదా, రాయిస్టుల మీదా రవిచంద్ అభిప్రాయాలు శాస్త్రీయంగా వున్నాయి. “గీతాగీతా భగవద్గీతా” “మాతా మాతాభారతమాతా” అని వీధుల్లో ఆర్.ఎస్.ఎస్. వాళ్ళు నినాదాలు ఇస్తున్నారు. పడగలెత్తుతున్న భూస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయవలసిన అవసరం వుంది. రాయిస్టులు మార్క్సిజంమీద రాళ్ళు విసిరే మతి తప్పిన కుహనా మేధావుల గుంపు. ఆర్.ఎస్.ఎస్. వాళ్ళతోనూ, సర్వోదయ వాళ్ళ తోనూ చాటుమాటు కాపురం చేస్తున్న రాయిస్టుల నిజస్వరూపాన్ని బహిర్గతం చెయ్యాలి. రవిచంద్ యువతాత్వికుడు. ఇలాంటి యువకులు విప్లవోద్యమానికి ఎంతో అవసరం. మార్క్సిజం మీద నిబద్ధతాగౌరవం, ప్రజాపోరాటాల్లో మమేకం కావాలనే తపనావున్న రవిచంద్ ప్రజాతత్వశాస్త్రాన్ని అభివృద్ధిచేసే కార్యకర్తగా పరిణతి చెందగలడు.

౦౦౦౦